కోలాహలం.. నిమజ్జనోత్సవం


ఇందుకూరుపేట : మైపాడు బీచ్‌లో..

ముత్తుకూరు : వినాయక చవితి పండగ సందర్భంగా ఈనెల 18న పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేసేందుకు కృష్ణపట్నం సమీపంలోని సముద్రానికి తరలించారు. ముత్తుకూరు, బ్రహ్మదేవి, తాళ్లపూడి, వల్లూరు, కృష్ణపట్నంపోర్టు, పిడతాపోలూరు, నారికేలపల్లి తదితర గ్రామాల నుంచి బాణసంచా కాలుస్తూ, రంగులు చల్లుకొంటూ ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను ఊరేగించారు. తప్పెట్లు తాళాల నడుమ కేరింతలు కొడుతూ, బంగాళాఖాతంలో నిమజ్జనం చేశారు.


మనుబోలు : పడమటివీధిలోని గణనాథుడు

కృష్ణపట్నం పోర్టు నుంచి..

కృష్ణపట్నం పోర్టులో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహానికి అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సీఓఓ సంజయ్‌కొత్త తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఉద్యోగుల సమక్షంలో విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.

ఘనంగా ఉట్టి మహోత్సవాలు

పొదలకూరు : వినయక చవితి వేడుకల్లో భాగంగా యువకులు బుధవారం ఘనంగా ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని పద్మావతినగర్, రామమందిరం వీధి, యాదవవీధి, తొగటివీధి సెంటర్లలో యువకులు ఉట్టికొట్టి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మేళతాళాలు, బాణాసంచాతో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు కాయకర్పూరం సమర్పించి పూజలు చేశారు.

పలుచోట్ల

మండలంలోని చాలాచోట్ల వినాయక నిమజ్జనోత్సవం చేపట్టారు. పొదలకూరు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు, గ్రామాల్లోని బొమ్మలను యువకులు నిమజ్జనం చేశారు. సంగం పెన్నానది, కండలేరు ఏటికాలువ తదితర ప్రాంతాలకు విగ్రహాలను తరలించి నిమజ్జనం చేశారు. కాగా మరికొన్ని ప్రాంతాల వారు ఐదో రోజున నిమజ్జనోత్సవాన్ని నిర్వహించనున్నారు.


పొదలకూరు : మొగళ్లూరులో గ్రామోత్సవం

• పొదలకూరు : మండలంలోని మొగళ్లూరులో చవితి వేడుకల్లో భాగంగా బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ఉట్టి మహోత్సవం జరిగింది. అనంతరం బాణసంచా, వేళతాళాలతో ఊరేగింపు ఏర్పాటు చేశారు.

తీరంలో సందడి

ఇందుకూరుపేట : వినాయక చవితి ఉత్సవాల్లో ప్రధానమైన నిమజ్జన కార్యక్రమం మండలంలోని మైపాడు బీచ్‌లో బుధవారం సందడి వాతావరణంలో జరిగింది. మండల పరిధిలో వివిధ రూపాల్లో ప్రతిష్ఠించిన మహా గణపతి విగ్రహాలను సాగరతీరానికి తీసుకొచ్చి నిమజ్జనాలు చేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా భక్తులు తప్పెట్లు, బాణసంచాల మధ్య రంగులు చల్లుకొంటూ ఉత్సాహంగా తీరానికి చేరుకొని సముద్ర స్నానాలు ఆచరించి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు.

విశేష పూజలు

మనుబోలు : మండల పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండల కేంద్రమైన మనుబోలులోనే 20 పైగా విగ్రహాలను వివిధ కూడళ్లలో ఏర్పాటు చేశారు. వాడవాడలా నెలకొల్పిన గణనాథుల విగ్రహాల వద్ద సందడి కొనసాగుతోంది. నిత్యం బొజ్జగణపయ్యకు ధూపదీప నైవేద్యాలతో పూజలు చేస్తున్నారు. కాగా పలు కూడళ్లలో కొలువుదీర్చిన బొజ్జ గణపయ్యలకు బుధవారం ప్రత్యేక పూజలు చేసి అనంతరం అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించి సమీప వాగుల్లో నిమజ్జనం చేస్తున్నారు. మరికొద్ది రోజులపాటు నిమజ్జనాలు కొనసాగుతాయి.


ఇందుకూరుపేట : మైపాడు తీరానికి తీసుకొచ్చిన గణనాథుని విగ్రహం


ముత్తుకూరు : పోర్టు నుంచి విగ్రహాన్ని తరలిస్తున్న ఉద్యోగులు


పొదలకూరు : ఉట్టి కొడుతున్న యువకులు


పొదలకూరు : నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుని ప్రతిమ


ముత్తుకూరు నుంచి నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

క్లుప్తంగా

గ్యాస్ బుకింగ్ సులభతరం


గ్యాస్ బుకింగ్‌పై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

కోవూరు (విడవలూరు) : ప్రస్తుతం గ్యాస్ బుకింగ్ ఎంతో సులభతరమైందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ అధికారులు పేర్కొన్నారు. విడవలూరు మండలంలోని ఊటుకూరు గ్రామంలో పొదుపు మహిళలకు నీలిచక్ర హెచ్‌పీ గ్యాస్ వారు గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) సహకారంతో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సఖి పథకంలో భాగంగా ఒక్కో గ్రామంలో ఒక పొదుపు మహిళకు చేయూతను అందిస్తామని, గ్యాస్ కావాల్సిన వారు ఏజెన్సీ వద్దకు వెళ్లకుండా సిలిండర్ పొందే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఏజెన్సీ ద్వారా అందించే అన్ని సేవలతో పాటు ఆన్‌లైన్ బుకింగ్, కొత్త కనెక్షన్లు, గ్యాస్ వినియోగంలో రక్షణ చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం చిన్నయ్య, హెచ్‌పీసీఎల్ నెల్లూరు సేల్స్ మేనేజర్ అశోక్, ఏపీఎం హరి, నీలిచక్ర హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డివి చిల్లర రాజకీయాలు


మాట్లాడుతున్న అడపాల ఏడుకొండలు

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, ఇకనైనా మానుకోకపోతే తీవ్రపరిణామాలు తప్పవని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా నేత అడపాల ఏడుకొండలు హెచ్చరించారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గత టీడీపీ హయాంలో నీరు–చెట్టు, రైతు రథం పేరుతో సోమిరెడ్డి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న విషయం వాస్తవం కాదానని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఊహకందని అభివృద్ధిని కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేయించారని, దీనిని చూసి ఓర్వలేక సోమిరెడ్డి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నేతలు చీకుర్తి పుట్టయ్య, ఉప్పు అశోక్ మాట్లాడుతూ మండల వెంకటశేషయ్యపై తప్పుడు ఆరోపణలు చేయించడం మంచి పద్ధతి కాదన్నారు. వైస్ ఎంపీపీ పచ్చుబట్ల మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు నాటకం శ్రీనివాసులు, మండల పెంచలయ్య, అక్బర్‌బాషా, మందా కృష్ణ, సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

1న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

నెల్లూరు(మినీబైపాస్): గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి పాటల పోటీలను అక్టోబర్ ఒకటిన నిర్వహించనున్నామని కళాంజలి 55 కళా కార్మిక సంఘాల సభ్యుడు శ్రీనివాస చక్రవర్తి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. 15 ఏళ్లపైన వయస్సు గల వారు పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. విజేతలకు నగదు పురస్కారాలను అందజేయనున్నామని, వివరాలకు 98856 65530 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గురజాడకు ఘన నివాళి

నెల్లూరు (టౌన్): మహాకవి గురజాడ ఆశయాలపై శోధన ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘ గౌరవాధ్యక్షుడు పెరుగు రామకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని వెంకటేశ్వర విద్యాలయంలో గురజాడ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ఉపాధ్యక్షులు వెంకటప్పయ్య, అవ్వారు శ్రీధర్‌బాబు, రచయిత రాధాకృష్ణ, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, డైట్ అధ్యాపకుడు విజయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నెల్లూరు(బారకాసు): ఆర్ అండ్ బీ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని నగరంలోని ఆర్ అండ్ బీ సర్కిల్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మునికేశవులు, గౌరవాధ్యక్షుడు రమణ, ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, శాఖ సర్కిల్ ఎస్ఈ గంగాధర్ హాజరయ్యారు. ఆర్ అండ్ బీ ఎంఈఏ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ మస్తానయ్య, అసోసియేట్ అధ్యక్షుడు మధు, కార్యదర్శి సురేష్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

పౌష్టికాహారం లోపిస్తే రక్తహీనత

• ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

మనుబోలు : గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం లోపిస్తే రక్తహీతనకు గురవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ తెలిపారు. మండలంలోని యాచవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా మాసోత్సవాల్లో భాగంగా సిబ్బందితో కలిసి పోషకాహారం ఆవశ్యకతపై బుధవారం అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారం ఎలా తయారు చేయాలో వివరించారు. గర్భిణులు, బాలింతలు రోజువారీ ఆహారంగా ఆకుకూరలు, తాజా పండ్లు, గుడ్లు, పాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. సీజన్ ప్రకారం పండ్లు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వారికి బాలామృతం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుభాషిణి, ఎంపీహెచ్‌ఏ చంద్రశేఖర్, అంగన్‌వాడీలు సుజన, లక్ష్మి, మునెమ్మ, సుగుణమ్మ, నిర్మల పాల్గొన్నారు.

పొదుపు సభ్యులకు శిక్షణ


మాట్లాడుతున్న ఏపీఎం రుక్మిణి

కొడవలూరు : మండల పొదుపు సమాఖ్య జాతీయ పురస్కారాలకు ఎంపికైన నేపథ్యంలో స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో పొదుపు సభ్యులకు ఏపీఎం ఎస్.రుక్మిణి ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొడవలూరు మండలం మోడల్‌గా ఎంపికైన నేపథ్యంలో మండలంలో ఉన్న అన్ని పొదుపు సంఘాల్లోని సభ్యులకు నాలుగు రోజులు పాటు ట్రెనింగ్ ఉంటుందని చెప్పారు. ఇందులో భాగంగా ప్రతి సభ్యురాలికి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ శిక్షణ ద్వారా ప్రతి పొదుపు సభ్యురాలు సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వ లబ్ధి ద్వారా జీవనోపాధులను ఏ విధంగా మెరుగు పరుచుకోవాలి.. ఆర్థిక ప్రగతి ఎలా సాధించాలి తదితర అంశాల గురించి వివరిస్తామన్నారు. వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా మహిళలు ఎలా అభివృద్ధి చెందాలో ట్రెనింగ్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ, కార్యదర్శి ప్రవీణ, కోశాధికారి సుశీల, సీసీలు ఉదయ్‌కుమార్, మమత, శోభ, శ్రీదేవి, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు


ఘటనా స్థలంలో బైక్, కారు


రమేష్ మృతదేహం

• కారు ఢీకొని ఒకరి మృతి

కోవూరు : ఓ కారు అదుపుతప్పి రెండు మోటార్ బైక్‌లను ఢీకొని మరో ఇద్దరు వ్యక్తుల మీదకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పోతిరెడ్డిపాళెం పంచాయతీ సాలుచింతల వద్ద ముంబై రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఒంటేరు సుబ్రహ్మణ్యం, సాలుచింతల ప్రాంతానికి చెందిన బత్తల రమేష్ (52) గుంటకట్ట వినాయక గుడి వద్ద అన్నదాన కార్యక్రమంలో భోజనం చేశారు. అనంతరం రోడ్డు పక్కన నడిచి వెళ్తున్నారు. ఇదే సమయంలో సంగం మండలంలోని సిద్దీపురంలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న బెజవాడ నాగరాజు విధులు ముగించుకుని నెల్లూరు వైపు తన కారులో వస్తున్నాడు. సాలుచింతల వద్దకు వచ్చేసరికి నాగరాజు షుగర్ లెవల్స్ ఒక్కసారిగా పెరిగి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కారు అదుపుతప్పి రెండు మోటార్‌బైక్‌లను ఢీకొంది. అనంతరం రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న ఇరువురిపై దూసుకెళ్లడంతో సుబ్రహ్మణ్యంకు తీవ్రగాయాలు కాగా బత్తుల రమేష్ (52) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

వరుణుడిపై కోటి ఆశలు

• సెప్టెంబర్‌లోనూ మండుతున్న ఎండలు
• చినుకు పడేనా.. మెట్ట సేద్యం సాగేనా?


సాగుకు సిద్ధం చేసుకున్న మెట్టభూమి

పొదలకూరు : మెట్టరైతులు వరుణుడిపై కోటి ఆశలు పెట్టుకున్నారు. ప్రతిఏటా సెప్టెంబర్ నాటికి వర్షాలు కురవాల్సి ఉంది. అయితే వరుణుడి దోబూచులాటతో మెట్ట సేద్యం సాగేలా లేదు. ప్రతి నిత్యం సాయంత్రం ఆకాశం మేఘావృతం అవుతున్నా స్వల్పంగా చినుకులు మాత్రమే పడుతున్నాయి. వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా వర్షాలు కురవడం లేదు. దీనివల్ల అపరాల సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఇతర పంటలను పండించే రైతులు ఇప్పటి వరకు దుక్కిదున్నకం పనులను కూడా చేపట్టలేదు. అయితే అక్టోబర్ మూడో వారం వరకు మెట్ట పంటల సాగుకు సమయం ఉన్నా రైతుల్లో ఉత్సాహం కనిపించడం లేదు. ప్రతిఏటా మండలంలో రైతులు మినుము, పెసర అపరాల పంటలను 10 వేల ఎకరాల్లో సాగు చేపట్టేవారు.

మునుపెన్నడూ లేనివిధంగా..

సెప్టెంబర్ మొదటి వారంలో స్వల్పంగానైనా వర్షాలు కురిస్తే మెట్ట రైతులు మినుము, పెసర, పచ్చిశనగ, కంది పంటల సాగుకు సమాయత్తం అయ్యేవారు. అయితే వర్షాలు పడడం అటుంచి ఎండలు మండుతున్నాయి. సెప్టెంబర్‌లో మునుపెన్నడూ లేనివిధంగా 37 డిగ్రీల ఎండ కాస్తోంది. దీంతో మెట్టరైతులు అపరాల సాగుపై ఆశలు వదులుకుంటున్నారు. ఇప్పటి వరకు దుక్కిదున్నకం పనుల జోలికి కూడా వెళ్లలేదని రైతులు వెల్లడిస్తున్నారు.

నాలుగేళ్లుగా పుష్కలంగా వర్షాలు

వరుసగా నాలుగేళ్లు వర్షాలు సకాలంలో కురుస్తూనే ఉంది. అంతేకాక సోమశిల, కండలేరు జలాశయాలు నిండుకుండలా ఉండేవి. ఈ ఏడాది ఖరీఫ్‌లో కొంత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. రబీ సీజన్‌కు అక్టోబర్, నవంబర్ మాసాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఈ ప్రాంతంలో రబీ సీజన్లోనే అత్యధిక సంఖ్యలో రైతులు వరి పండిస్తారు. పైతట్టు ప్రాంతాల నుంచి వరదలు వస్తే సోమశిలకు నీరు వచ్చి చేరుతుంది. స్వల్పంగా చేపట్టే మెట్టల సాగుకు సకాలంలో వర్షం కురవని కారణంగా ఇబ్బందులు తలెత్తాయి.


గతేదాది చేపట్టిన మినుము సాగు(ఫైల్)

ఎస్ఈకి సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన విజయన్‌ను వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు బుధవారం సత్కరించారు. ఎస్ఈ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శాలువా కప్పి పుష్పగుచ్ఛాలను అందజేశారు. విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఈకి వినతిపత్రాన్ని యూనియన్ రీజినల్ సెక్రటరీ శివయ్య అందజేశారు. నేతలు కోటేశ్వరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

కో ఆపరేటివ్ బ్యాంక్‌లో డీసీఓ పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న డీసీఓ సుధాభారతి

ఇందుకూరుపేట : మండలంలోని ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ రూరల్ బ్యాంక్‌ను జిల్లా సహకార అధికారిణి(డీసీఓ) బి.సుధాభారతి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు.
సంఘాలకు సంబంధించిన వివరాలను సిబ్బందితో ఆరాతీశారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కాకుటూరులో చోరీ

వెంకటాచలం : తాళం వేసిన ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగలు, నగదును దోచికెళ్లిన ఘటన మండలంలోని కాకుటూరులో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన వలిపి అంకయ్య నివాసంలో మంగళవారం ఎవరూ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలో ఉన్న రెండు సవర్ల బంగారు నగలు, రూ.10 వేల నగదును చోరీ చేశారు. కాగా అంకయ్య బుధవారం గ్రామానికి చేరుకోగా తలుపులు పగులకొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

కోవూరు (విడవలూరు) : విడవలూరు మండలం పార్లపల్లి గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ మీద బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామస్థాయిలో హెచ్ఐవీపై అవగాహన కల్పించాల్సిన అవసరం తప్పనిసరిగా ఉందన్నారు. సమావేశంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ ప్రజలు, చైల్డ్ ఫండ్ ఇండియా డీపీపీ సురేఖ, మున్ని, సుప్రియ పాల్గొన్నారు.